క్లుప్తంగా

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

మణుగూరుటౌన్: గైర్హాజరు ఉద్యోగులు విధులకు హాజరై సంస్థ అభివృద్ధిలో పాల్పంచుకోవాలని పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. సోమవారం జనవరి నుంచి నేటి వరకు 60 పనిదినాలు కూడా లేని సుమారు 20 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంతర్గత నియామకాల ద్వారా పదోన్నతులు పొందుతున్న వారిని స్ఫూర్తిగా తీసుకుని విధులకు సక్రమంగా హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ సౌరబ్ సుమన్, ఓంకారి బాపు, ట్రైనీ(పర్సనల్) వంశీకృష్ణ, చంద్రకిరణ్, యూనియన్ నాయకులు గైర్హాజరు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటుచేసిన వేసవి శిక్షణ శిబిరాల్లో తరగతులకు హాజరై, అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సోమవారం ఎంఈఓ కీసర లక్ష్మి అభినందించారు. మండలంలోని పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరంలో ముందస్తుగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో, ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈఓ చేతుల మీదుగా మెమొంటోలను అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీతారామయ్యకు నివాళి

దుమ్ముగూడెం: ఏజెన్సీలోని ఆదివాసీలు, వారి అభివృద్ధి కోసం పరితపించిన మహనేత యలమంచి సీతారామయ్య అని సీపీఎం సీనియర్ నాయకుడు యలమంచి రవికుమార్, కారం పుల్లయ్యలు అన్నారు. సోమవారం లక్ష్మీనగరం గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ఎదుట ఉన్న యలమంచి సీతారామయ్య స్థూపం వద్ద పుచ్చలపల్లి సుందరయ్య, యలమంచి సీతారామయ్యల వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీ పోలీసులకు సన్మానం



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న సీఐ, ఎస్సైలు

మణుగూరురూరల్: మండల కేంద్రంలోని మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ వివిధ పోలీస్‌స్టేషన్లకు బదిలీపై వెళ్తున్న సిబ్బందిని మణుగూరు ఇన్‌చార్జ్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై మేడ ప్రసాద్‌లు సోమవారం పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆత్మీయ వీడ్కోలు పలికారు. బదిలీ అయిన వారిలో కానిస్టేబుళ్లు కన్నయ్యదొర, రవీందర్, రాథోడ్ బిక్కోజీ, సనయ్, షమీమ్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐలు శాంతి, జ్యోతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేతాజీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

మణుగూరుటౌన్: నేతాజీ వాకర్స్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా సామ శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రావులపల్లి రామ్మూర్తి, కోశాధికారిగా వడ్డానం రమేశ్‌లను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా ఎస్.విజయ్‌భాస్కర్‌రెడ్డి, పుచ్చకాయల శంకర్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, కటకం సతీష్‌లను నియమించారు. జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, రాంరెడ్డి, శంకర్, శేషగిరిరావు, తిరుపతిరావు, శంకర్‌రెడ్డి, సంతోష్, రవీందర్ నాయక్, కనుకు రమేశ్, కంపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దుమ్ముగూడెం: మండలంలోని నడికుడి గ్రామంలోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన తెలుగుదేశం పార్టీ మండల మహానాడులో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర పార్టీ పరిశీలకుడు వట్టం నారాయణ, ఉపాధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్, పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి వాసిరెడ్డి చలపతిరావుల సమక్షంలో నూతన కమిటీ ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా కొమరం దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కోయిలమూడి సాగర్, ఉపాధ్యక్షులుగా కెల్లా వేణు, ముళ్లపూడి ప్రసాద్, నిర్వాహక కార్యదర్శులుగా నల్లూరి వీర్రాజు, కల్లూరి ప్రసాద్, అన్నె గోపాలకృష్ణ, కార్యదర్శులుగా సోంది వీరాస్వామి, ఎల్లోజీ, మర్మం గోపాల్, కోశాధికారిగా పాతూరి ప్రసాద్, ఊటుకూరి గోపయ్య, కుంజా నవీన్, కల్లూరి జానకమ్మలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలు తీర్మానాలను ఆమోదించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను స్థానిక కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు జూపల్లి ప్రమోద్, ఎస్‌కే బాబా, వల్లెపు దుర్గారావు, అనపర్తి సత్యనారాయణ, సాయిల రవి, పదిలం సత్తిబాబు పాల్గొన్నారు.

చెరువు అలుగు ఆక్రమణ?

- ఇళ్లలోకి మరలుతున్న మత్తడి నీరు
- ప్రతి ఏటా స్థానికులకు తప్పని తిప్పలు
- సమీపిస్తున్న వర్షాకాలం.. పట్టించుకోని అధికారులు



ఇళ్లలోకి చేరిన వరద (ఫైల్)



రేగడి చెరువు అలుగు ప్రాంతంలో నిర్మించిన కట్టడాలు

గుండాల: పిల్లి కళ్లుమూసుకుని పాలు తాగుతూ నన్నెవరూ చూడట్లేదు అన్న చందంగా ఉంది రేగడి చెరువు అలుగు కాలువ ఆక్రమణదారుల పరిస్థితి. ఓ పక్క కోడెల వాగునుంచి వచ్చే నీళ్లతో చెరువు ఎప్పుడూ మత్తడి దూకుతూ నిండుకుండలా ఉంటుంది. మరో పక్క అలుగు వరద జల్లేరులో కలుస్తుంది. జల్లేరువాగు పోటెత్తే క్రమంలో అలుగు వరదంతా ఇళ్లల్లోకి వచ్చి చేరుతోంది. సులువుగా నీరుపారే అలుగు ప్రాంతాన్ని కొంతమంది ఆక్రమణ చేయడంతో ప్రతీ ఏటా ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలుగు ప్రాంతంలో కట్టడాలు

ఆళ్లపల్లి మండలంలోని మర్కోడు పంచాయతీ కేంద్రంలోని రేగడి చెరువు కింద సుమారు 400 ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ చెరువులోకి నీరు వచ్చేలా గతంలో కోడెల వాగుపై చెక్‌డ్యాం నిర్మించారు. దీంతో ప్రతీ ఏటా చెరువు నీటితో కళకళలాడుతుంది. అటు వచ్చే నీళ్లతో ఇటు అలుగు సైతం ఉప్పొంగి ప్రవహిస్తుంది. అలుగు వరద పక్కనే ఉన్న జల్లేరు వాగులో కలుస్తాయి. గత నాలుగేళ్లుగా కొంతమంది అలుగు ప్రాంతాన్ని ఆక్రమించుకుని యథేచ్ఛగా కట్టడాలు నిర్మించుకుంటున్నారు. మరికొంతమంది మట్టిపోసి కాలువను క్రమక్రమంగా జరుపుతూ వస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో కాలువ రోజురోజుకూ చిన్నగా అయిపోతోంది. వర్షాకాలం వస్తే అలుగు ఉధృతి పెరుగుతోంది. అటు జల్లేరు వాగు సైతం ఉధృతి పెరిగితే రెండువైపులా వరద ఇళ్లలోకి వచ్చి చేరుతుంది. గత రెండేళ్ల క్రితం వచ్చిన భారీ వర్షమే ఇందుకు సాక్షి. నాడు ఇళ్లలోకి వచ్చిన వరద నీరు చేరింది.

రహదారి, కల్వర్టులకూ ముప్పు

ఆక్రమణను తొలగించకపోతే మర్కోడుకు వెళ్లే ప్రధాన రహదారి సైతం కోతకు గురౌతుంది. కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. అక్కడే ఉన్న విద్యుత్ స్తంభం సైతం ప్రమాదపు అంచున ఉంది. త్వరలోనే వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

అధికారుల చర్యలేవి?

సమస్యపై గత నాలుగు సంవత్సరాలుగా అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు వచ్చి పరిశీలించడం, బదిలీపై వెళ్లడం తప్ప సమస్య పరిష్కారం కావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే జనావాసాలు జలదిగ్బంధంలో చిక్కుకుంటాయి. ఈ విషయమై ఆర్ఐ రామయ్యను వివరణ కోరగా ఆక్రమణ తమ దృష్టికి వచ్చిందని, తాము పరిశీలన చేశామని తెలిపారు. అక్కడ కొంత పట్టా భూమి ఉందని, అలుగు ప్రాంతం విషయమై ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. ఇరిగేషన్ ఏఈ హఫీజ్‌ను వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానని, పరిశీలన చేస్తానని తెలిపారు.

గ్రామాభివృద్ధిపై పోలీసుల ఆరా



మొబైల్ సిగ్నల్ సమస్యను పోలీసులకు వెల్లడిస్తున్న అడవిరామారం గ్రామస్తులు

గుండాల: ఆళ్లపల్లి మండలం అడవిరామారం గ్రామాన్ని సీఐ రవీందర్ తన సిబ్బందితో సోమవారం సందర్శించారు. అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలో మొబైల్ సిగ్నల్ రావడం లేదని విన్నవించగా బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులతో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించినట్లు సీఐ తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంత అభివృద్ధి నిధులతో కమ్యూనిటీ హాల్ పోలీస్ శాఖ ద్వారా నిర్మాణం చేపట్టడం జరిగిందని వెల్లడించారు. అసాంఘిక శక్తులకు యువత సహకరించొద్దని, తెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సైదా రహూఫ్, ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులకు విఘాతం



సారపాకలో ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు, కార్యకర్తలు

బూర్గంపాడు: ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించి ఆదివాసీ హక్కులకు పాలకులు విఘాతం కలిగిస్తున్నారని సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ నాయకులు గుర్రం విజయ్‌కుమార్, టీఎస్‌ఎఫ్ నాయకులు రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డిలు విమర్శించారు. సోమవారం తెలంగాణ రైతు కూలి సంఘం, సీపీఐ(ఎంఎల్) పార్టీ ఆధ్వర్యంలో సారపాక బ్రిడ్జి సెంటర్ నుంచి పల్లె ప్రకృతి వనం వరకు ప్రదర్శన నిర్వహించారు.అనంతరం పార్టీ డివిజన్ నాయకులు పున్నంచంద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో జాతీయ నాయకులు మాట్లాడారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఆదివాసీల ఆమోదం లేకుండా ఎలాంటి పథకాలు, పనులు చేపట్టకుడదనే చట్టాలను పాలకులు కాలరాస్తున్నారన్నారు. 1/70 చట్టం, అటవీహక్కుల చట్టం, పీసా చట్టాలను పకడ్బందీగా అమలు చేసి ఆదివాసీలకు పోడుభూములకు హక్కులు, సాగు హక్కు, నివాస హక్కులను కల్పించాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతుకూలి సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా బండ్ల వెంకటేశ్వర్లు, డి.పున్నంచంద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు కూలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొర్ల ఆనంద్, రాష్ట్ర కార్యదర్శి కెమిడి ఉప్పలయ్య, ప్రసాద్, కుంజా వెంకటేశ్వర్లు, ఊకే సుశీల, కారం నర్సింహారావు,సోంది గోపమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



భూక్యా గన్యా



భగవాన్ రెడ్డి



శిరీష



పుల్లారావు

దమ్మపేట తహసీల్దార్‌గా భగవాన్‌రెడ్డి

దమ్మపేట: దమ్మపేట మండల తహసీల్దార్‌గా భగవాన్ రెడ్డి సోమవారం కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. గత కొంతకాలంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ వాణి.. తహసీల్దార్ బాధ్యతలను భగవాన్ రెడ్డికి అందజేశారు. పలువురు నాయకులు, పెద్దలు, గ్రామస్తులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి, శుభాకాంక్షలు తెలిపారు.

బూర్గంపాడు తహసీల్దార్‌గా శిరీష

బూర్గంపాడు: బూర్గంపాడు తహసీల్దార్‌గా శిరీష సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ఇక్కడికి బదిలీపై వచ్చిన వివేక్‌ను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సుజాతనగర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న శిరీషను ఇక్కడకు బదిలీ చేశారు. తహసీల్దార్ శిరీష పౌరసేవలను వేగవంతం చేస్తామన్నారు.

ములకలపల్లి తహసీల్దార్‌గా భూక్యా గన్యా

ములకలపల్లి: ములకలపల్లి తహసీల్దార్‌గా భూక్యా గన్యా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన గుడ్ల పుల్లారావు అన్నపురెడ్డిపల్లి మండలానికి బదిలీకాగా, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా విధులు నిర్వహిస్తున్న గన్యా ములకలపల్లికి వచ్చారు.

అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్‌గా పుల్లారావు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): స్థానిక తహసీల్దార్‌గా జి.పుల్లారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన దోమల జగదీశ్వర్‌ప్రసాద్ భద్రాచలం బదిలీ అయ్యారు. పుల్లారావుకు కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

భద్రాచలానికి జగదీశ్వరప్రసాద్ నియామకం

భద్రాచలంటౌన్: భద్రాచలం మండల తహసీల్దార్ టి.శ్రీనివాసరావును జూలూరుపాడుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అన్నపరెడ్డిపల్లికి చెందిన జగదీశ్వరప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, శ్రీనివాసరావును ఏడాది కూడా గడవకుండానే బదిలీ చేయడంపై భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. భద్రాచలం మండల తహసీల్దార్‌గా జగదీశ్వరప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

నేడు విద్యుత్ అంతరాయం

దమ్మపేట: మండలంలోని మందలపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో నేడు(మంగళవారం) అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ వెంకటరత్నం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మందలపల్లి సబ్ స్టేషన్‌లో 33 కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు, రైతులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

23న ఇసుక వేలం

ములకలపల్లి: ఈనెల 23వ తేదీన ఇసుక బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గన్యా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా వివిధ దాడుల్లో స్వాధీనం చేసుకొని, తహసీల్ ఆవరణలో నిల్వ చేసిన 8 ట్రాక్టర్ల ఇసుక వేలం వేయనున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతం నేపథ్యంలో షెడ్యూల్ తెగలకు చెందిన వ్యక్తులు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు.

రూ.లక్ష విరాళం అందజేత

ములకలపల్లి: మండలపరిధిలోని నర్సాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కోదండ రామాలయం, ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠకు తాండ్ర నారాయణ రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ట్రస్ట్ సభ్యులు నరాటి ప్రసాద్, కొదుమూరి పుల్లారావు, డాక్టర్ గోపి, తాండ్ర బుచ్చిబాబు, ఇనుగంటి రాము, పువ్వాల లలితారావు చేతుల మీదుగా సోమవారం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎర్రగొర్ల రామారావు, బజ్జూరి కృష్ణ, గుంట్రు సాయిరాం, మరీదు నాగు, బజ్జూరి ఈశ్వర్, పామర్తి వెంకటేశ్వరారవు తదితరులు పాల్గొన్నారు.

చిన్న కొర్రాజుల స్వామికి పూజలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వేదాంతపురం గ్రామంలో నిర్వహిస్తున్న చిన్న కొర్రాజుల స్వామి వారి తిరునాళ్ల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం శ్రీ చిన్న కొర్రాజుల స్వామి వారిని ఆలయం ప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించగా, అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న వారిని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం పరామర్శించారు. మండలంలోని గండుగులపల్లి, నాయుడుపేట గ్రామాలకు చెందిన బాధితులను పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు.

సుదర్శన హోమం

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సుదర్శన హోమం నిర్వహించారు. స్వామివారి పుట్టిన రోజును పురస్కరించుకుని శ్రావణనక్షత్రం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని జరిపించారు. ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కులధ్రువ పత్రాల కోసం ధర్నా




ఎస్టీ కులధ్రువపత్రాలు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న ఆదివాసీలు

చర్ల: ఎస్టీ కులధ్రువపత్రాలను జారీ చేయాలని డిమాండ్ చేస్తూ వలస ఆదివాసీలకు సోమవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన గొత్తికోయలు ముందుగా చర్లలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ.. పాటించడం లేదని, కొందరు అక్రమంగా సర్టిఫికెట్లు పొందారని గొత్తికోయలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన తీవ్రతరం కావడంతో ఎస్ఐ కేశవ్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని గొత్తి కోయలతో చర్చించారు. బహుజన్ సమాజ్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొండ చరణ్, కొండ కౌశిక్ గొత్తికోయల ఆందోళనకు మద్దతు పలికారు.


తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిబంధనలను విరుద్ధంగా కులధృవపత్రాలు జారీ అయినట్లు వస్తున్న ఆరోపణల వ్యవహారంపై విచారణ చేసి రద్దు చేస్తామని, గొత్తికోయల కుల ధ్రువీకరణ పత్రాల జారీపై జిల్లా కలెక్టర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. దీంతో గొత్తికోయలు ఆందోళన విరమించారు. మురియా యువసేన నాయకులు మడకం చందు, పదం జోగయ్య, ఊడం ఉంగయ్య, మడకం రాజు, రాజయ్య, సోమయ్య, గంగయ్య, గంగోలి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య


కమ్యూనిస్టు దిగ్గజం, దివంగత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం పలుచోట్ల నిర్వహించారు. ఆయన చిత్రపటాల వద్ద సీపీఎం, దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగం కోసం జీవితాంతం పోరాడిన మహానేత పుచ్చలపల్లి సుందరయ్య అని వక్తలు కొనియాడారు. సమాజ గమనాన్ని అధ్యయనం చేసి ప్రజలలో పోరాట పటిమను పెంచారని గుర్తు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



దమ్మపేట: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



బూర్గంపాడు: సారపాకలో పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చంద్రుగొండ: సుందరయ్య చిత్రపటం ఎదుట జోహార్లు అర్పిస్తున్న నాయకులు

ఆయిల్‌ఫెడ్‌పై ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న రామచంద్రప్రసాద్

దమ్మపేట: ఆయిల్‌ఫెడ్ ప్రతిష్ఠకు భంగం కలిగేలా ఆరోపణలు చేయడం సరికాదని పామాయిల్ సలహాదారు కమిటీ సభ్యుడు అలపాటి రామచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఆర్థికంగా నిలబెట్టిన ఆయిల్‌ఫెడ్ వ్యవస్థను ప్రైవేట్ కంపెనీల నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చిన్నపాటి లోపాలు, సమస్యలు ఉంటే అంతర్గతంగా చర్చించుకోవాలే తప్ప సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారం చేయొద్దని సూచించారు. ఆఫ్‌టైప్ మొక్కలు వచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని అందేలా చూడాలని మంత్రి తుమ్మలను కోరామని తెలిపారు. రైతులు కందిమళ్ల కృష్ణారావు, మొగళ్లపు చెన్నకేశవులు, కాసాని నాగప్రసాద్, కేవీ సత్యనారాయణ, దొడ్డా భాస్కరరావు, దొడ్డా ప్రసాద్, శ్రీరాముల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని బండిరేవు గ్రామానికి చెందిన చల్లపల్లి వంశీ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతుండగా.. దుమ్ముగూడెం యువత సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మండల వ్యాప్తంగా ఉన్న యువతతో పాటు తెలిసిన వారు తలో చేయి వేసి రూ.34వేలు సేకరించి బాధితుడి కుటుంబానికి హైదరాబాద్‌లో అందజేశారు. ఆర్థికసాయం సేకరించిన యువకుల్లో తెల్లం హరికృష్ణ, కుంజా రఘు, రేసు శ్రీను, కల్లూరి సుమన్, మధు, చిరంజీవి, హేమంత్‌లు ఉన్నరు.

అనాథ వృద్ధులకు వితరణ



వృద్ధులకు దుస్తులు, పండ్లు అందిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: అనాథలకు బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమవారం వితరణ అందించారు. సోమవారం అశ్వారావుపేటలోని అమ్మ సేవా సదనంలో వినాయకపురం గ్రామానికి చెందిన పార్టీ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావు తన మనవరాలు బిర్రం హేమశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకుని అనాథ ఆశ్రమంలోని వృద్ధులకు దుస్తువులు అందించారు. మామిడి కాయలను పంచారు. అదే విధంగా వారి సమక్షంలోనే కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిర్రం రాజేష్, అనాథ ఆశ్రమం నిర్వాహకురాలు కూరపాటి అనసూయ, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రిలో తిరంగా ర్యాలీ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారత్ పరాక్రమానికి ప్రతీక 'ఆపరేషన్ సిందూర్'వీరవిజయాన్ని స్మరించుకుంటూ సోమవారం రాత్రి తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకాలను చేతబూని తిరంగాయాత్రలో పాల్గొన్నారు. అయ్యప్పస్వామి ఆలయం నుంచి ప్రారంభమై అంబేడ్కర్ సెంటర్ మీదుగా కాలేజ్ గ్రౌండ్ వరకు యాత్ర కొనసాగింది. మనం సైతం దేశం కోసం, భారత భద్రత బలగాల వెంటే మనం, భారత్ ఉగ్రవాదాన్ని ఓడిస్తుంది.. భారత్ మాతాకు జై అంటూ నినాదాలు చేశారు.

వికసించిన 'మే' పుష్పాలు



సారపాక కోయగూడెంలో ఓ ఇంట్లో వికసించిన మే పుష్పాలు

బూర్గంపాడు: సారపాకలోని కోయగూడెంలోని ఓ నివాసంలో మే పుష్పాలు వికసించాయి. అరుదుగా కనిపించే ఈ పుష్పాలను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. కొందరు మే పుష్పాలతో సెల్ఫీలు తీసుకుంటున్నారు.

ఆందోళనలో అన్నదాతలు



మల్కారంలో రైతులు ఆరబోసిన ధాన్యం

దమ్మపేట: అకాల వర్షాలతో పాటుగా ధాన్యం కొనుగోలులో జాప్యం కారణంగా అన్నదాతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మల్కారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఫ్లాట్ ఫారాలు లేని కారణంగా రైతులు తాత్కాలికంగా కల్లాలను ఏర్పాటు చేసుకొని ధాన్యం ఆరబోశారు. ఆరబోసిన ధాన్యపు రాశులపై కప్పుకోవడానికి, టార్పాలిన్ పట్టాలు కూడా అవసరమైన మొత్తంలో అందడం లేదు. ఇదిలా ఉండగా గడిచిన కొద్ది రోజులుగా వర్షాలు పడుతుండటంతో పగలంతా ధాన్యాన్ని ఆరబోస్తూనే, ఎప్పుడు వర్షం వస్తుందో తెలియక టార్పాలిన్ పట్టాలతో సిద్ధంగా ఉండాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా రెండు వారాలు గడిచినప్పటికీ తమ ధాన్యం కాంటా వెయ్యట్లేదని, సంబంధిత నిర్వాహకులను అడిగితే తేమశాతం ఎక్కువగా ఉందని సాకులు చెప్పి ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఐకేపీ సీసీ సత్యనారాయణను వివరణ కోరగా.. రెండు వారాల కిందట రైతులు ధాన్యం ఆరబోసిన మాట నిజమేనని అన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా చూపిస్తోందని, తేమశాతం 17 లోపుగా ఉంటే తప్పనిసరిగా కాంటా వేయిస్తామని తెలిపారు.